## క్లుప్తంగా

### రాజరాజేశ్వరిదేవికి గొలుసు బహూకరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి శుక్రవారం బంగారయ్య కొట్టాలుకు చెందిన గాజులపల్లి పార్వతమ్మ బంగారు గొలుసును బహూకరించారు. 16.420 గ్రాములు బంగారు చైన్‌ను తయారు చేయించి అమ్మవారికి అలంకరించమని ఆలయ నిర్వాహకులకు అందించారు. పార్వతమ్మను ఆలయ ఈఓ శంకర్ బాలాజీ, మాజీ ఆలయ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు.

### నేడు చట్టాలపై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని వాగ్దేవీ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఉదయం 10.30 గంటలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీస్ చైర్మన్ జీఎస్ రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 4 నుంచి 11 వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని వాటి ద్వారా ఎలా రక్షణ పొందాలనే విషయమై సదస్సులో వివరిస్తామని తెలిపారు. విద్యార్థినులు, అధ్యాపక సిబ్బంది హాజరుకావాలన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌన్సిలర్ కమాల్ బాషా, వడ్ల దాదాపీర్, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### వైభవంగా కోట పోలేరమ్మ తిరునాల



పోలేరమ్మకు పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సుధాకర్ కుటుంబసభ్యులు

పోరుమామిళ్ల : పట్టణంలోని రంపాడురోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ తిరునాల శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. మహిళలు అమ్మవారికి చల్లన్నం తీసుకుని ఆలయానికి వచ్చారు. ఉదయం 7 గంటలకు కలశస్థాపన, పూజా కార్యక్రమాలు జరిగాయి. పురాతన శివాలయం రామలింగేశ్వరస్వామి దేవస్థాన గౌరవ అధ్యక్షుడు తులసి సుధాకర్ కుటుంబసభ్యులు పట్టువస్త్రాలు పోలేరమ్మకు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మైదుకూరు : మైదుకూరు, ఖాజీపేట, చాపాడు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైదుకూరు ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరులోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

### నేడు వైద్య సేవలు

చాపాడు : మండలంలోని పెద్దగురువళూరు గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటలకు నుంచి మధ్యాహ్నం వరకూ వైద్య సేవలను అందించి, మధ్యాహ్నం నుంచి ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని వైద్యాధికారి తెలియజేశారు.

### పశువులకు సకాలంలో వ్యాక్సిన్ వేయించాలి

దువ్వూరు : పశువులకు సకాలంలో ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించడం వలన గాలికుంటు వ్యాధిని నివారించవచ్చునని మండల పశువైద్యాధికారి ఫణీంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచనపల్లె గ్రామంలో శుక్రవారం పశువులకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుందని, ఈ వైరస్ వల్ల పశువులకు నోటిలో పుండ్లు, గిట్టల మధ్య బొబ్బలు వస్తాయని పేర్కొన్నారు. ఈ వ్యాధి లక్షణాలు 10 నుంచి 15 రోజులు పశువుల్లో ఉంటాయని, సకాలంలో ఎఫ్ఎండీ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల వ్యాధిని అరికట్టవచ్చని రైతులకు సూచించారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే రాచమల్లు ప్రచారం**



గౌతమి ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గౌతమ్ హైస్కూల్, టీవీఆర్‌హైస్కూల్, గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాతే మన బడి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడంతోపాటు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయడం, యూనిఫాం, షూస్ ఇవ్వడం లాంటి విప్లవాత్మకమైన మార్పులు చేశారన్నారు. వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగరాజు, ప్రొఫెసర్లు జయచంద్రారెడ్డి, కేవీ రమణయ్య, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు, సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ గురుమూర్తిరెడ్డి, టీవీఆర్, గౌతమ్ హైస్కూళ్ల కరస్పాండెంట్ రమణారెడ్డి, సుధీర్, గౌతమి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ నాగూర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపటినుంచి అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు



మున్నెల్లిలోని అంకాలమ్మ మూలవిరాట్

బి.కోడూరు : కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా మండలంలోని మున్నెల్లిలో వెలసిన అంకాలమ్మ విరాజిల్లుతోంది. ఈమెను దర్శించుకుని కోర్కెలు కోరితే తప్పక నెరవేరడంతో పాటు విఘ్నాలు తొలగి సకల సౌభాగ్యాలు కలుగుతాయని ప్రజల గట్టి నమ్మకం . ఈ బ్రహ్మోత్సవాలను ఈనెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. 5వ తేదీ అకుపూజ, 6వ తేదీన ధ్వజారోహణం, 7న కలశ స్థాపన, చలిబిండి నానుబాలు కార్యక్రమాలు, 8వ తేదీన పగలు మున్నెల్లి, బోడుగుండుపల్లె గ్రామాలకు చెందిన సుడిబండ్లు, బి.మఠం మండలం కేశాపురం గ్రామానికి చెందిన కుంకుమబండ్లు, వెంకటాపురం గ్రామానికి చెందిన నగదాబండ్లు చూపరులను ఆకట్టుకుంటాయి. అదే రోజు మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, తదితర వసతులను ఆలయ ధర్మకర్త ఓబుల్‌రెడ్డి ప్రభాకర్‌రెడ్డి కల్పించారు.

## పెంచిన గ్యాస్ ధరలపై నిరసన

పోరుమామిళ్ల : వంటగ్యాస్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచడంపై శుక్రవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. రూ.450 ఉన్న గ్యాస్ ధర బీజేపీ పాలనలో 12 వందలకు చేరిందన్నారు. జీఎస్టీ పేరుతో నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించని బీజేపీ ప్రభుత్వం పేదల నడ్డి విరచేందుకు సిద్ధమైందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించక పోతే కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

## నేడు అమ్మవారిశాల వార్షికోత్సవం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని శ్రీమత్కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాల 6వ వార్షికోత్సవాన్ని శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు లింగం పట్టాభి రామయ్య ఒక ప్రటకనలో తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష సుగంధ ద్రవ్యాల అభిషేకాలు, అలంకరణ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

## వన్యప్రాణులను రక్షించడం బాధ్యతగా భావించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

బద్వేలు అర్బన్ : వన్యప్రాణులను రక్షించడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని ఎఫ్ఆర్ఓ మధుబాబు పేర్కొన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వలన మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని అన్నారు. అడవులు కాలడం వలన తీవ్రమైన కాలుష్యం ఏర్పడి సరైన సమయంలో వర్షాలు కూడా పడవని వివరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓలు శ్యాంసుందర్, సువర్ణకుమార్, రాజేష్‌రెడ్డి, రెడ్డెమ్మ, పుష్పరాజ్, ఏబీఓలు అక్బర్, సుంకయ్య, శాంతిప్రసన్న, మునాఫ్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ వెంకటమహేష్ తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు క్రైం : ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ హెల్పర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఎన్నుకున్నారు. డిపో సెక్రటరీగా ఎంపీరావు, గ్యారేజీ సెక్రటరీగా ఈ.రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మర్యాదపూర్వకంగా డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డిని కలిసి తమ కమిటీ ఎన్నిక పత్రాలను అందించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జి.బాలయ్య, చీఫ్ అడ్వైజర్ ఎస్ఎస్ నారాయణ పాల్గొన్నారు.

## ప్రజలపై భారాలు మోపుతున్న బీజేపీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై భారాలను మోపుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో రూ.440 ఉన్న గ్యాస్‌ను అధికారంలోకి వచ్చాక ఉచితంగా ఇస్తామని చెప్పి నేడు రూ.1250కి తీసుకువచ్చారని మండిపడ్డారు. దేశంలోని ప్రజలపై పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలన్నారు. ప్రస్తుతం వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ కొరత రాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర నాయకులు సుబ్రమణ్యం, కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, బషీరున్నీషా పాల్గొన్నారు.

## 246 ప్యాకెట్ల రేషన్ బియ్యం పట్టివేత

– ఇద్దరిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచిన గోడౌన్‌పై శుక్రవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అందులో ఉన్న 20 బస్తాల నూకలు, 246 చౌకబియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం ప్యాకెట్లను ప్రభుత్వ గోదాముకు తరలించారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన శరత్, రాములపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

## సైన్సు డే పోటీల్లో 'మను'విద్యార్థుల ప్రతిభ



సాధించిన పథకాలు, సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్‌లో ఇటీవల నిర్వహించిన సైన్సు డే ప్రదర్శనా పోటీల్లో మొదటి రెండు బహుమతులను తమ కళాశాల విద్యార్థులకే దక్కడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. ఈ పోటీలకు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల నుంచి ఎగ్జిబిట్లు వచ్చాయి. మంచి ఆలోచనతో కూడిన నమూనాలు, పోస్టర్స్, వీడియో కాన్సెప్ట్, మోడల్స్ ప్రదర్శించడంతోనే మొదటి రెండు బహుమతులను తమ విద్యార్థులే కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకుగాను శుక్రవారం సంబంధిత విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ముఖ్సిత్‌ఖాన్‌తోపాటు హెచ్‌ఓడీ డాక్టర్ హకీముద్దీన్‌లను ప్రత్యేకంగా అభినందించారు. అధ్యాపకులు డాక్టర్ హకీముద్దీన్, మోహమ్మద్ సికిందర్ హుస్సేన్, ఖాజా మొయినుద్దీన్, అకిల్ అహ్మద్, అల్కమ్ మసూద్ పాల్గొన్నారు.

## కరపత్రాల విడుదల

మైదుకూరు : విజయవాడ స్మృతి వనంలో అంబేడ్కర్ విగ్రహం పక్కన బాబూ జగజ్జీవన్ రామ్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 24న విజయవాడలో దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంపై శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

- చెక్కును అందజేసిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



హోంగార్డు హరికృష్ణ తల్లి అన్నపూర్ణమ్మకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డుగా విధులను నిర్వర్తించే హరికృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో హరికృష్ణ కుటుంబానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2 లక్షల ఆర్థిక సహాయం శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయంను హోంగార్డు హరికృష్ణ తల్లి పి. అన్నపూర్ణమ్మకు అందజేశారు. రూ. 10 వేల ఫ్లాగ్ ఫండ్‌ను కూడా జిల్లా ఎస్పీ అందజేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసుశాఖ అండగా వుంటుందనీ భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి ఎన్. జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్ పాల్గొన్నారు.

## మహిళా మండలి అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

ఖాజీపేట :ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈ ఎన్నికలో ఖాజీపేట ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. అందులో అధ్యక్షురాలిగా తాతా విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా మాకం రాధిక, తాతా సునిత, సెక్రటరీగా సుధామణి, జాయింట్ సెక్రటరీగా శిరీషా, ట్రెజరర్‌గా లక్ష్మి సరస్వతి తోపాటు కమిటీసభ్యులను ఎన్నుకున్నారు.

## 6,7న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

కడప రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఈనెల 6, 7వ తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా మహిళా విభాగం చైర్మన్ శాంతమ్మ, కన్వీనర్ భారతి తెలిపారు. శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలోని జియోన్ కళాశాల మైదానంలో సాయంత్రం 3 నుంచి జిల్లాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో అన్నిశాఖల ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన కేంద్రకారాగార అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కళాదర్శిని ఆర్ట్ గ్యాలరీని కడప కేంద్రకారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.జవహర్‌బాబు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన కళాఖండాలను మెచ్చుకున్నారు. సామాజిక, మానసిక రుగ్మతలను నివారించి, ఉత్తమ సమాజ నిర్మాణానికి కళలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఆర్ట్ గ్యాలరీ ఇన్‌చార్జి మృత్యుంజయరావు, సతీష్‌బాబు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించండి



మాట్లాడుతున్న ఏఓ అరవిందనాయక్

గోపవరం : గ్రామస్థాయిలో ఉన్నటువంటి క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించాలని మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె రైతుభరోసా కేంద్రంలో గ్రామస్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో ఉన్నటువంటి సమస్యలు, రైతుభరోసా, పీఎం కిసాన్ నగదు జమకాకపోవడం, పశువులకు వ్యాక్సిన్ వేయకపోవడం, తెగుళ్ల నివారణ చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ వేసవికాలంలో వేడిగాలుల నుండి పంటలను రక్షించుకునేందుకు చేపట్టవలసిన నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. మత్స్యశాఖ కింద ఫిష్ ఆంధ్ర పథకాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలను సంరక్షించుకుందాం !



స్ట్రీట్ వాక్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఇతర సిబ్బంది

కడప రూరల్ : ఆడపిల్లల సంరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆడపిల్లల సంరక్షణ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం పటిష్టంగా అమలు పరచడంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. అందులో భాగంగా శుక్రవారం రిజిష్టర్ చేయించుకోని స్కానింగ్ సెంటర్లను గుర్తించడానికి డాక్టర్స్ ప్రాక్టీస్ చేస్తున్న ప్రాంతాలలో స్ట్రీట్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ నాగరాజు మాట్లాడుతూ జిల్లా అంతటా టీముల వారీగా ఏర్పడి స్ట్రీట్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా స్వీకరించాలన్నారు. రిజిష్టర్ చేయించుకోని స్కానింగ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ ఎ.ఉమామహేశ్వరరెడ్డి, ఎంవీ చంద్రారెడ్డి, సునీల్‌కుమార్, ఆ శాఖ సిబ్బంది కుమారి, వెంగల్‌రెడ్డి, నవనీతమ్మ, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లను రక్షిద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్ : ప్రస్తుత సమాజంలో రోజురోజుకు ఆడపిల్లల పుట్టుకలు తగ్గిపోతున్నాయని, ఆ సంఖ్యను పెంచి ఆడపిల్లలను బ్రతికిచేందుకు ప్రతిఒక్కరం కృషి చేద్దామని సురేంద్రనగర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోంలో లింగవివక్షపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించి మాట్లాడారు. ముఖ్యంగా ఆడపిల్లల నిష్పత్తిని పెంచాలంటే ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం, స్కానింగ్ సెంటర్ల యజమానులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చూడాలని, ఇందుకు కమిటీ సభ్యులు నిఘా ఉంచాలని కోరారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొలుత పట్టణంలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ జియావుల్లా, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు జనార్ధన్, శ్రీరాములయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలభవిత కేంద్రం.. ప్రారంభానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధం చేస్తున్న బాలభవిత కేంద్రం భవనం

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో కొత్తగా నిర్మిస్తున్న జిల్లా బాలభవిత కేంద్రం భవన సముదాయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఆస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ.2.83 కోట్లతో భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రూ.80లక్షలతో బాలభవిత కేంద్రం, రూ.2.03 కోట్లతో మొదటి అంతస్తులో సెంట్రల్ ల్యాబ్, కాన్ఫరెన్స్‌హాల్, ఇతర నిర్మాణాలను చేపడుతున్నారు. ఇటీవల జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి వచ్చిన కలెక్టర్ విజయరామరాజు బాలభవిత కేంద్రం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే దాదాపుగా పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన బయటి ఫినిషింగ్ పనులను మరో వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. ఈ నెల 10 నాటికి భవనాన్ని అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రస్తుతం బాలభవిత కేంద్రం జిల్లా ఆస్పత్రిలోని పాత క్యాజువాలిటి విభాగంలో నిర్వహిస్తున్నారు.

# మోదీ చేస్తున్న అభివృద్ధిని వివరించండి



బీజేపీ నాయకులతో చర్చిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

మైదుకూరు : ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని అందరికీ వివరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మైదుకూరులోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై సమావేశంలో సోము వీర్రాజు సమీక్ష చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారాన్ని ముమ్మరం చేయాలని ఆయన నాయకులకు సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సాధారణ అంశాలపై పట్టు అవసరం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య

వైవీయూ: విద్యార్థులు అకడమిక్ అంశాలతో పాటు సమకాలీన, సాధారణ అంశాలు(జనరల్ నాలెడ్జి) పై పట్టు సాధించాలని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం, ఏపీ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి క్విజ్ కాంపిటీషన్ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్‌బ్లాక్‌లో నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలతో పాటు మనచుట్టూ జరిగే అంశాలను, జనరల్ స్టడీస్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జనరల్ నాలెడ్జ్‌పై కూడా దృష్టిసారించాలని తద్వారా పోటీపరీక్షల్లో ముందుండవచ్చని తెలిపారు. క్విజ్ కాంపిటీషన్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.వి. జయంత్‌కశ్యప్ మాట్లాడారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాల నుంచి 22 టీంలు ఈ కాంపిటీషన్‌లో పాల్గొనడం విశేషం. ఏపీ ఉన్నతవిద్యామండలి అకడమిక్ కన్సల్టెంట్ డా. బి. యల్లారెడ్డి, ఏపీ ఉన్నతవిద్యామండలి నోడల్ అధికారి ఎం. రమేష్‌కుమార్, ఎ. నగేష్, వైవీయూ అధ్యాపకులు ఆచార్య కె. గంగయ్య, డా. సుభోష్ చంద్ర, కె.శ్రీనివాసరావు, డా. టి. సురేష్‌బాబు పాల్గొన్నారు.

## డిస్కౌంట్‌తో లేపాక్షి వస్తువుల అమ్మకాలు

కడప కల్చరల్: కడప నగరం కోటిరెడ్డిసర్కిల్‌లోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో వస్తువులను తగ్గింపు ధరలకు విక్రయించనున్నామని శాఖ మేనేజర్ బీపీ వెంకటేశం తెలిపారు. రాష్ట్ర హస్తకళలు, చేనేతశాఖ ఆధ్వర్యంలోని ఈ షోరూం అమ్మకాల్లో రాష్ట్రంలో రెండవస్థానంలో ఉందని, ఉగాది, శ్రీరామ నవమి తదితర పండుగలను పురస్కరించుకుని ప్రజలకు హస్తకళలను అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశ్యంతో ఈ డిస్కౌంట్ ప్రకటిస్తున్నామన్నారు. హస్త కళాకారులు తయారు చేసిన వస్తువులపై 40 శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. గృహాలంకార వస్తువులతో పాటు గిఫ్ట్ ఆర్టికల్స్‌కు ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని, మార్చి 30వ తేదీ వరకు ఈ పథకం అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

## 6న వాహనాల వేలం పాట

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 6న వేలం పాట వేయనున్నట్లు కడప ఎస్ఈబీ సీఐ విశ్వనాథ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట కడప ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు వివరాలకు కడప ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## 5న సమావేశం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు కడప జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సర్వ సమావేశం జరగనుంది. 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు కడపలోని నేక్ నామ్ కళాక్షేత్రంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ చెన్నారెడ్డి తెలిపారు.